సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 24 । ఆగస్టు । 2024



మందగించిన కొనుకోళ్లు


మాంసాహార ప్రియులు చికెన్ ముఖం చూడడం లేదు.. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోళ్లు కనిపించడం లేదు.. ఫలితంగా చికెన్ ధర పాతాళానికి పడిపోయింది. - 8లో



ముగిసిన అంతర్జాతీయ సదస్సు

మండపేట మండలం మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. - 8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 2,29,891 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.30 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 12,500 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

27న నిధి ఆప్‌కే నికత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 27వ తేదీన నిధి ఆప్‌కే నికత్ డిస్ట్రిక్ట్ అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వైడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరిజిల్లా ఈతకోటలోని అవంతిఫీడ్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎస్.యానం వేదాంతలో, కాకినాడ జిల్లాలో కత్తిపూడిలోని దొడ్ల డెయిరీలోను, ఏలూరుజిల్లాలోని ద్వారకాతిరుమలలోని శ్రీవెంకటేశ్వర లార్జ్‌సైజ్ కోపరేటివ్ సొసైటీలోను, పశ్చిమగోదావరిజిల్లాలో పాలకోడేరులోని కోపరేటివ్ సొసైటీలోను, అల్లూరిసీతారామరాజు జిల్లాలో వై.రామవరంలోని కమ్యూనిటిహెల్త్ సెంటర్‌లోను, గంగవరం మండల విద్యాధికారి కార్యాలయంలోను, మారేడుమిల్లిలో పంచాయతీలోను ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈసీఆర్, రిటర్న్‌పై అవగాహన, యూఏఎన్‌లో సరైన కేవైసీ వివరాలను సీడింగ్ చేయడం, సభ్యుల వివరాలు సకాలంలో దిద్దుబాటు, డిజిటల్ సంతకం తదితర అంశాలపై జరుగుతుందన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రాంను ఉపయోగించుకోవాలని కోరారు. నిధి ఆప్‌కే నికత్ అని తమ ఫిర్యాదులను సమర్పించవచ్చన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులకు 6 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో డిసెంబర్ 8న జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 6వ తేదీ వరకూ గడువు ఉందని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని, పరీక్ష రాసే సమయానికి వాటిని సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజుగా ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని తెలిపారు.

సీనియర్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

కొవ్వూరు: సహకారశాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పీవీవీహెచ్ రవిశంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొవ్వూరులో పనిచేసే ఈయన గత ఏడాది మే 30న విజయవాడ బదిలీ అయ్యారు.12 రోజుల పాటు ఎర్న్‌డ్ లీవ్ పెట్టిన ఆయన అనంతరం విధుల్లో చేరకపోవడం, సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెడుతున్న ఆరోపణలపై సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.

జీవన ప్రమాణాలు పెంచేలా ఉపాధి పనులు

– మంత్రి దుర్గేష్



కాటకోటేశ్వరం గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామంలో స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కొయ్యల వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించడంతో పాటు ఉపాధి మెటీరియల్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఉపాధిహామీ నిధులు రూ.11 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. కాటకోటేశ్వరంలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఏడాది నాలుగు గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులు, గ్రామాల సమస్యలపై చర్చిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీఓ పి.శామ్యూల్ పాల్గొన్నారు.



వైఎస్సార్ తీసుకువచ్చిన చట్టాన్ని అమలు చేయడం లేదు

ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు ఎక్కువ అయ్యాయి. రక్షణ లేదు. కోల్‌కతాలో జరిగిన సంఘటన చాలా ఘోరమైంది. అటువంటి తరహా దాడులు జరగకుండా చట్టాలు తీసుకురావాలి. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన చట్టాన్ని అమలు చేయడం లేదు. వైద్యులపై ఏదైనా దాడి జరిగితే ఏడేళ్ల జైలు శిక్ష, నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసేలా ఆయన చట్టాన్ని తీసుకువచ్చారు. అది కార్యరూపం దాల్చలేదు. పేషెంట్‌లను చూడాలంటే భయపడే స్థితికి డాక్టర్లు వచ్చారు. టీచింగ్ ఆసుపత్రుల్లో పీజీలు చేసే వైద్య విద్యార్థులకు పని సమయాలు ఎక్కువయ్యాయి. నిబంధనలు పాటించడం లేదు.

– డాక్టర్ కందుల సాయి, సుగర్ వ్యాధి నిపుణులు, రాజమహేంద్రవరం





బోధన ఆసుపత్రుల్లో అనుకూలమైన వాతావరణం కల్పించాలి

బోధనాసుపత్రుల్లో అనుకూలమైన వాతావరణం ఉండడం లేదు. వైద్య విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి. ఇటీవల కాలంలో ప్రభుత్వ, బోధనాసుపత్రుల వద్ద, బయట ప్రాంగణాల్లో అసాంఘిక కార్యకలాపాలు చేసేవారు, రౌడీషీటర్లు దర్శనమిస్తున్నారు. దానిని నియంత్రించే దిశగా పోలీసులు, ఆసుపత్రి అధికారులు చర్యలు చేపట్టారు. కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన దాడిపై ప్రభుత్వాలు ఆలోచించాలి. చట్టాల్లో పలు మార్పులు తీసుకురావాల్సిన అవసరం చాలా ఉంది. బోధనాసుపత్రుల్లో రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలి. మరో విద్యార్థి బలికాకుండా చూడాలి.

– డాక్టర్ గురుప్రసాద్, ఐఎంఏ ప్రెసిడెంట్, రాజమహేంద్రవరం

బదిలీలకు పచ్చజెండా!

- 15 శాఖల్లో ట్రాన్స్‌ఫర్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నెలాఖరుకు ప్రక్రియ ముగించాలని నిర్ణయం
- ఎస్‌ఈబీను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసేందుకు సన్నాహాలు
- సెప్టెంబర్ 15 తర్వాత ఆ శాఖ ఉద్యోగుల బదిలీలు
- అదే స్థానాల్లో ఉండేందుకు అధికారుల పైరవీలు
- ఎమ్మెల్యే, మంత్రుల వద్దకు క్యూ
- సిఫారసు కోసం పాట్లు
- భారీగా సమర్పించుకుంటున్న వైనం



సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు 'పచ్చ'జెండా ఊపింది. ఉన్నత స్థాయి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ఈ బదిలీలు జరగనున్నాయి. 15 శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై నిషేధాన్ని ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు ఎత్తివేసింది. ఆ లోపు ప్రక్రియ పూర్తవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. వీటి నుంచి వైద్యులు, ఉపాధ్యాయులను మినహాయించింది. 2024 జూలై 1వ తేదీ నాటికి ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పకుండా స్థాన చలనం కలిగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సై ఇలా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను బదిలీ చేశారు. ఇకపై మిగిలిన గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేయనున్నారు. వీటిని నెలాఖరులోపు పూర్తి స్థాయిలో చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టారు.

పైరవీల జోరు

ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేల సిఫారసులు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఇటీవల జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదనుగా భావించిన కూటమి ఎమ్మెల్యేలు, క్షేత్ర స్థాయి నాయకులు దోపిడీకి తెర తీశారు. అధికారులు ఉన్న స్థానంలోనే కొనసాగాలని తమకు తెలిసిన నాయకులతో పైరవీలు చేయించేందుకు పావులు కదుపుతున్నారు. అవకాశాన్ని వినియోగించుకుంటున్న ఎమ్మెల్యేలు పోస్టుకు ఓ ధర పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వసూళ్ల బాధ్యతలను ప్రత్యేకంగా పీఏలకు అప్పగించేస్తున్నారు. సిఫారసుల లేఖల కోసం ఎమ్మెల్యే, మంత్రుల ఇళ్ల వద్ద అధికారులు పడిగాపులు కాస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేల అనుచరులు, ద్వితీయ శ్రేణి నేతలు గత టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు పనిచేసిన అధికారులను తిరిగి అవే స్థానాల్లో నియమించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

జనసేన, బీజేపీ ఎమ్మెల్యేల నుంచి పెద్ద ఎత్తున సిఫారసు లేఖలు వస్తుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నతాధికారులు సతమతం అవుతున్నారు. ఒకే పోస్టుకు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు సిఫారసు చేస్తుండటంతో ఎవరికి ఓకే చెప్పాలో తెలియక తికమకపడుతున్నారు. ప్రధానంగా వీఆర్‌ఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సై, సీఐ, ఇంజినీరింగ్, ఈఓపీఆర్డీ, ఏఓ పోస్టుల కోసం భారీగా డిమాండ్ ఏర్పడింది. డీఈఓ బదిలీ కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. కీలకమైన స్థానాలను ఎలాగైనా దక్కించుకోవాలన్న తలంపుతో ఎంత ఖర్చు పెట్టేందుకైనా వెనుకాడటం లేదు. ఇదే అవకాశంగా మలచుకున్న ఎమ్మెల్యే, మంత్రులు అందినకాడికి పిండుకుంటున్నారు. వెరసి రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు తెలిసింది. సిఫారసు లేఖల కోసం వస్తున్న వారితో ఎమ్మెల్యే, మంత్రుల ఇళ్ల వద్ద జాతర వాతావరణం నెలకొంది. లూప్‌లైన్‌లో ఉన్న అధికారులు ప్రధాన పోస్టులోకి వచ్చేందుకు భారీ ఎత్తున ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది.

ఎస్‌ఈబీ నిర్వీర్యానికి కుట్ర

నాటుసారా, అక్రమ మద్యం అరికట్టేందుకు గత ప్రభుత్వం ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)గా విభజించింది. సెబ్ ద్వారా నాటుసారా స్థావరాలపై దాడులు చేసి నాటుసారాను అరికట్టడంలో కీలక భూమిక పోషించింది. పరివర్తన పేరుతో ఎన్నో కుటుంబాల్లో మార్పు తీసుకువచ్చింది. అంతటి ప్రాముఖ్యం ఉన్న సెబ్‌ను నిర్వీర్యం చేసి.. తిరిగి ఆ విభాగాన్ని ఎక్సైజ్‌లో విలీనం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఇందులో భాగంగా ఈ శాఖలో బదిలీలను నిలిపేసింది. నూతన మద్యం పాలసీ తీసుకురానున్నట్లు వెల్లడిస్తున్న ప్రభుత్వం.. సెప్టెంబర్ 15 నుంచి ఈ శాఖలో బదిలీలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ తరుణంలో ఆదాయం వచ్చే పోస్టులు కావడంతో ఎక్సైజ్‌లో కీలక స్థానాల కోసం టీడీపీ అనుకూల అధికారులు పైరవీలకు తెర తీశారు. రూ.లక్షలు ముట్టజెప్పేందుకు సైతం వెనకాడటం లేదు.

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికీ అవకాశం

గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది బదిలీలకు సైతం మార్గం సుగమమైంది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. బదిలీ మార్గదర్శకాలను సైతం వెలువరించింది. ప్రక్రియ మొత్తం కలెక్టర్ పర్యవేక్షణలో జరిగేలా ఆదేశాలు జారీ చేసింది.

బదిలీలు జరిగే శాఖలు

రెవెన్యూ(భూ పరిపాలన), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, పురపాలక, పట్టణాభివృద్ధి, గ్రామ, వార్డు సచివాలయాలు, పౌరసరఫరాలు, గనులు, భూగర్భ వనరులు, దేవదాయ, రవాణా, అటవీ శాఖ, పరిశ్రమలు, ఇంధన, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, అన్ని శాఖల్లోని ఇంజినీరింగ్ విభాగాలు.

రెవెన్యూ, విద్యుత్ శాఖల్లో డిమాండ్

- ఆదాయం ఉన్న రెవెన్యూ, విద్యుత్ శాఖల్లో పోస్టింగ్‌ల కోసం రూ.లక్షల్లో మామూళ్లు ఇచ్చేందుకు ఉద్యోగులు సిద్ధం అవుతున్నారు.
- రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ తహసీల్దార్ పోస్టుకు ఏకంగా రూ.20 లక్షలు పలుకుతోందంటే ఆ పోస్టుకు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో అర్థం అవుతోంది.
- రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ ఉద్యోగి కొన్నేళ్లుగా అక్కడే తిష్ట వేశారు. తహసీల్దార్ ఉన్నా.. తనే తహసీల్దార్ అవతారం ఎత్తారు. ఏ పని జరగాలన్నా.. చేయి తడిపితే చాలు నిమిషాల్లో కానిచ్చేస్తున్నారు. గత ఐదేళ్లలో రూ.కోట్లు వెనకేసినట్లు సమాచారం. సదరు ఉద్యోగిని ఎవరూ కదిలించకపోవడం గమనార్హం. ప్రస్తుతం సైతం అక్కడే ఉండేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది.
- నిడదవోలు నియోజకవర్గానికి పోలీసులు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. మంత్రి స్థానిక నియోజకవర్గం కావడంతో ప్రొటోకాల్ తదితర ఖర్చులు ఎక్కడ భరించాలో అన్న ఉద్దేశంతో ఇక్కడికి వెళ్లేందుకు సాహసించడం లేదు.

రత్నగిరిపై పెళ్లి సందడి

- సత్యదేవుని సన్నిధికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు, నవ దంపతులు
- పెళ్లి బృందాలతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 2,200 వ్రతాల నిర్వహణ, ఆదాయం రూ.40 లక్షలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన నవ దంపతులు, వివాహ బృందాలు, భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు అన్నీ నవదంపతులు, భక్తులతో నిండిపోయాయి. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ముహూర్తాలలో రత్నగిరిపై సుమారు 200 వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో కూడా ఇవే ముహూర్తాలకి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో తమ బంధువులతో కలసి నవదంపతులు సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం వ్రత మంటపాలు, క్యూ లలో అన్నింటిలో నవ దంపతులు దర్శనమిచ్చారు. వందల సంఖ్యలో నవ దంపతులు సత్యదేవుని వ్రతాలాచరించారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

సుమారు 40 వేల మంది భక్తులు శుక్రవారం స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,200 జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీన జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించినవారిని సత్కరించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డిఎంఎం శేషగిరి ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు 24 నుంచి ఈ నెల 25వ తేదీ మధ్యలో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరిస్తామని పేర్కొన్నారు. ఖేలోఇండియా, యూనివర్శిటీ–స్కూల్‌గేమ్స్ క్రీడాకారులు, వెటరన్ క్రీడాకారులు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 60ఏళ్ల పైబడిన వయోవృద్ధుల నుంచి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ దరఖాస్తులు ఆహ్వానిస్తోందన్నారు. ఈ దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటలలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో నేరుగా వచ్చి మాత్రమే అందించాలన్నారు. వివరాలకు 86397 74430 నంబర్‌లో సంప్రదించాలని శేషగిరి కోరారు.

నన్నయ వీసీ పదవి శెట్టిబలిజలకు ఇవ్వాలి

రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ పదవి ఈసారి శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇవ్వాలని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధిక జనాభా కలిగిన శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఈ విషయంలో ఇంతవరకు అన్యాయం జరిగిందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక తిలక్ రోడ్డులో జరిగిన సమావేశం ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రామారావు మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం ఏర్పడిన తర్వాత తొలి వీసీగా కాపు సామాజిక వర్గానికి చెందిన కె.నిరూపరాణి, తర్వాత ఎస్సీ వర్గం నుంచి పి.జార్జివిక్టర్, వెలమ సామాజిక వర్గానికి చెందిన ఎం.ముత్యాలనాయుడు, క్షత్రియుల నుంచి పి.సురేష్ వర్మ, ఆ తర్వాత కాపు సామాజిక వర్గానికి చెందిన ఎం.జగదీశ్వరరావు, కె.పద్మరాజు చేయగా ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా వై.శ్రీనివాసరావు చేస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినిధుల ఇష్టాన్ని అనుసరించి ఈ నియామకాలు జరిగాయన్నారు. మట్టపర్తి సత్యనారాయణ, బొక్కా సత్యవెంకట ప్రతాప్, గుత్తుల గోపీనాథ్ పాల్గొన్నారు.

సేవలు ఆన్‌లైన్‌లోకి..

- సహకార సంఘాలు.. ఇక డిజిటల్
- మారనున్న పీఏసీఎస్‌ల రూపురేఖలు
- వాణిజ్య బ్యాంకుల తరహాలో కంప్యూటరీకరణ
- రాష్ట్రంలో ఆన్‌లైన్ విధానం అమలుకు చర్యలు



కొత్తపేట పీఏసీఎస్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇలా..

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ): 1 (కాకినాడ)

డీసీసీబీ బ్రాంచ్‌లు :	54
పీఏసీఎస్‌లు :	298
పీఏసీఎస్‌ల్లో సభ్యత్వ రైతులు:	4,67,380
రుణాలు పొందిన రైతులు :	2,50,000

కొత్తపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) రూపురేఖలు మారనున్నాయి.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేవలందిస్తున్న ఈ సంఘాలు వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే పని చేయనున్నాయి.. మరింత సౌకర్యవంతంగా, వేగవంతంగా సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ విధానం అమలులోకి తెస్తున్నారు. అన్నదాతలకు సత్వర సేవలను అందించేందుకు, వ్యవస్థలో లోపాలను అధిగమించేందుకు కంప్యూటరీకరించాలని కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో ఈ ప్రక్రియకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకూ సహకార సంఘాల్లో లావాదేవీలు చేతిరాత ద్వారా లెడ్జర్స్‌లో నమోదు చేస్తున్నారు. ఆ రికార్డులన్నీ నవీకరిస్తూ యుద్ధప్రాతిపదికన కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీసీసీబీ ఆధ్వర్యంలో కంప్యూటరీకరణ పనులు చేపడుతున్నట్లు పీఏసీఎస్‌ల సీఈఓలు తెలిపారు. మొత్తం 298 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటి అన్నింటిలో సేవలను పూర్తిగా కంప్యూటరీకరించడంతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే అన్నింటికీ కంప్యూటర్, ప్రింటర్, పాస్‌బుక్ ప్రింటర్, ఇన్వర్టర్, బ్యాటరీలు తదితరాలతో సాంకేతిక సామగ్రి అందించనున్నారు. గతంలో మాన్యువల్ విధానంలో ఉన్న వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. దీని కోసం నాబార్డు అధికారులు ప్రత్యేకంగా ఓ సాఫ్ట్‌వేర్ రూపొందించారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రూ.1,528 కోట్లు (60.73 శాతం), రాష్ట్ర ప్రభుత్వాలు రూ.736 కోట్లు (29.25 శాతం), నాబార్డు రూ.252 కోట్లు (10.02 శాతం) నిధులను వెచ్చిస్తున్నాయి. మొత్తం ఐదు దశల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందులో సభ్యత్వ నమోదు, భూమి, అప్పులు, డిపాజిట్స్, ఆదాయ వివరాలను నమోదు చేస్తున్నారు. ఇవే కాకుండా ఇకపై కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా రైతులతో పాటు ఇతర వినియోగదారులకు అదనపు ప్రయోజనాలుగా పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, రైలు, విమాన, బస్ రిజర్వేషన్లు, కరెంట్ బిల్లుల చెల్లింపులు తదితర డిజిటల్ సేవలు అందించనున్నారు.



కొత్తపేట పీఏసీఎస్‌లో మాన్యువల్ రికార్డులు కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

ఉపయోగాలు ఇలా...

సొసైటీలో నమోదైన ప్రతి ఖాతాదారుడికి కంప్యూటరైజ్డ్ పాస్‌బుక్ వస్తుంది. అందులో వారు తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, పడుతున్న వడ్డీ తదితర వివరాలు ఉంటాయి. భూముల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో నేరుగా ప్రభుత్వం అందించే రాయితీలు ఖాతాలో జమ అవుతాయి.

జిల్లా అధికారుల పర్యవేక్షణ

పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ ప్రక్రియను ఆయా జిల్లాల్లో ప్రతి రోజూ సమీక్షించే బాధ్యతను జేసీలకు ప్రభుత్వం అప్పగించింది. డీసీసీబీ బ్రాంచ్ పరిధిలో డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు, ఆయా జిల్లాల డీసీఓలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, డీపీడీఎంలు కంప్యూటరీకరణ పనులను మానిటరింగ్ చేస్తున్నారు.

అక్టోబర్ 2 నాటికి అమలులోకి..



గ్రామీణ ప్రాంతాల్లోని పీఏసీఎస్‌లు కూడా జాతీయ బ్యాంకుల తరహాలో రైతులకు, వివిధ రంగాల వినియోగదారులకు సేవలందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నాబార్డ్ ఆదేశాల మేరకు కంప్యూటరైజ్డ్ కార్యక్రమం చేస్తున్నారు. ఆప్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ డేటా అప్‌లోడ్ చేస్తున్నాం. సెప్టెంబర్ 15 నాటికి డేటా అప్‌లోడ్ ప్రక్రియ పూర్తి చేసి, అక్టోబర్ 2 నాటికి ఆన్‌లైన్ విధానం అమలులోకి తెస్తాం. ఆ మేరకు కంప్యూటరైజేషన్ ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం.

–ఎస్.మురళీకృష్ణ, జిల్లా సహకార అధికారి, అమలాపురం

సేవలను విస్తృతం చేసేందుకే...



పీఏసీఎస్‌లను నాబార్డ్ నిబంధనల ప్రకారం కంప్యూటరీకరణ చేస్తున్నాం. ఇకపై పీఏసీఎస్‌ల్లో సేవలను విస్తృతం చేసేందుకు ఈ కంప్యూటరైజేషన్ ఉపయోగపడుతుంది. పీఏసీఎస్‌ల వ్యాపారం కూడా మరింత పెంచుకునేందుకు తద్వారా ఆదాయ అభివృద్ధికి దోహదపడుతుంది. దీనికి రైతులంతా తమ రికార్డులను విధిగా ఆన్‌లైన్ చేయించుకుని సహకరించాలి.

– జగత ప్రసాద్, సీఈఓ, పీఏసీఎస్, కొత్తపేట

క్లుప్తంగా

తాటాకిల్లు దగ్ధం

ఏలేశ్వరం: స్థానిక క్వారీ ప్రాంతంలో శుక్ర వారం తెల్లవారు జామున ఓ తాటాకిల్లు కాలి పోయింది. కూలి పనులు చేసుకుంటూ జీవి స్తున్న దుందుర్తి సూరిబాబు తన కుటుంబ సభ్యులతో నిద్రలో ఉండగా, తెల్లవారు జామున ఒక్కసారిగా తాటికిల్లుకు మంటలు వ్యాపించాయి. దీంతో వారు భయంతో బయటకు పరుగులు తీశారు. శుభకార్యం నిమిత్తం తీసుకువచ్చిన రూ.50 వేలతో పాటు గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఈ సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమా పక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

యానాం: అందరూ చూస్తుండగానే ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నదిలోకి ఓ యువతి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఆ వివరాల్లోకి వెళితే.. యానాం రాజీవ్ రివర్‌బీచ్ వద్ద జీసెస్ స్టాట్యూ దిగువనున్న గోదావరి నదిలోకి తెల్ల చున్నీ వేసుకున్న యువతి (20) నడుచుకుంటూ వెళ్లి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. అటుగా వెళుతున్న స్థానికులు, సీగల్ సిబ్బంది రక్షిద్దామని పరుగున వెళ్లినప్పటికీ అప్పటికే ఆమె గోదావరిలో ఉధృతికి కొట్టుకుపోయింది. దూరం నుంచి ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఆ యువతి గోదావరిలో దిగుతున్న వైనాన్ని వీడియో తీశారు. యువతి ఆత్మహత్యాయత్నంపై యానాం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఆ యువతి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



24/7 రక్షణ ఏర్పాట్లు చేయాలి

సాధారణంగా పీహెచ్‌సీలు జనావాసాలకు దూరంగా ఉంటున్నాయి. నిర్మానుష్యంగా ఉండే పీహెచ్‌సీల్లో మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కోల్‌కతా ఘటన తరువాత విధుల నిర్వహణ భయంగా మారింది. పీహెచ్‌సీల వద్ద 24/7 రక్షణ ఏర్పాట్లు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. వైద్య సిబ్బంది ప్రాధాన్యం, వారి రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలి.

– యామినికావ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, కోటనందూరు



ప్రజల్లో అవగాహన పెంచాలి



కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. రాత్రిళ్లు విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతపై దృష్టి సారించాలి. పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి. అలాగే ఆసుపత్రుల వద్ద నైట్ వాచ్‌మన్‌లను ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలి.

– జగదాంబ, ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్, పెద్దాపురం

మందగించిన కొనుకోళ్లు



- రోజుకు 3.2 లక్షల కిలోల చికెన్ వినియోగం
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సగానికే పరిమితం
- లైవ్ ధర రూ.90, చికెన్ ధర రూ.185
- శ్రావణ మాసం, విష జ్వరాల ప్రభావమే కారణం

అలమూరు: మాంసాహార ప్రియులు చికెన్ ముఖం చూడడం లేదు.. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోళ్లు కనిపించడం లేదు.. ఫలితంగా చికెన్ ధర పాతాళానికి పడిపోయింది. దీంతో కోళ్ల పరిశ్రమ ఒడిదొడుకులను ఎదుర్కొంటూ నష్టాలను చవిచూస్తుంది. ఈ ఏడాది మే నెలలో కిలో బ్రాయిలర్ చికెన్ ధర రూ.350 పలకగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.185కి చేరింది. అదే రూ.167 పలికిన లైవ్ ధర రూ.90కు చేరింది. ప్రస్తుతం ఫారం కోడి లైవ్ కిలో రూ.83, మాంసం రూ.160 పలుకుతోంది. శ్రావణ మాసం ప్రభావంతో పాటు విజృంభిస్తున్న విష జ్వరాలు చికెన్ ధరల తగ్గుదలకు కారణమయ్యాయి. శ్రావణ మాసంలో జరిగే పెళ్లిళ్ల సీజన్‌పై గంపెడాశలు పెట్టుకున్న రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితిని చూస్తుంటే చికెన్ ధర పెరిగే అవకాశం కనిపించడం లేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, మండపేట, సీతానగరం, రాయవరం, అనపర్తి, రాజానగరం, రంగంపేట, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో పౌల్ట్రీ ఉన్నాయి. వీటిలో ఏటా 8 లక్షలకు పైగా కోళ్లు పెంచుతున్నారు. మార్కెట్‌లోకి ప్రతి రోజూ సుమారు 350 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్ల సరఫరా జరుగుతుంది. మూడు జిల్లాల్లో రోజుకు సగటున 3.2 లక్షల కిలోల చికెన్ వినియోగిస్తుండగా, సెలవులు, పర్వదినాల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలు జరుగుతూంటాయి. అయితే ఈ విక్రయాలు సగానికి పడిపోయాయి. బ్యాచ్ వేసిన ఐదు వారాల్లో రెండు కిలోల వరకూ బరువు పెరిగి బ్రాయిలర్ కోళ్లు వినియోగానికి వస్తాయి. పండగలు, జాతరలు, పెళ్లిళ్ల సీజన్‌ను బట్టీ నిర్ణీత సమయానికి అందుబాటులోకి వచ్చే విధంగా రైతులు ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్‌లు వేస్తుంటారు. మిగిలిన నెలలతో పోలిస్తే శ్రావణ మాసం నుంచి కార్తిక మాసం ముగిసే వరకూ చికెన్ వినియోగం తగ్గుతుంది. పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉంటే కొంతమేర అమ్మకాలు ఆశాజనకంగా ఉంటాయి. లేకుంటే నిలకడగా ఉంటుంది. సీజన్ల ఆధారంగా కోళ్ల రైతులు ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ కొత్త బ్యాచ్‌లు వేయడాన్ని కొంతమేర తగ్గిస్తుంటారు.



బ్రాయిలర్ కోళ్లు



లైవ్ చికెన్ ధర తగ్గినా యథావిధిగా అమ్మకాలు సాగిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

భారీగా ధర పతనం

ఈ ఏడాది మే నుంచి మూడు నెలల పాటు రికార్డు స్థాయిలో కొనసాగిన బ్రాయిలర్ చికెన్ ధర శ్రావణ మాసం రాగానే పతనమైంది. రెండు వారాల కిందటి వరకూ రిటైల్ మార్కెట్‌లో చికెన్ కిలో రూ.300 నుంచి రూ.350 వరకూ పలికగా, ప్రస్తుతం రూ.185కు చేరింది. శ్రావణ మాసంలో మహిళల పూజలు ఎక్కువగా చేయడంతో పాటు మరోపక్క జ్వరాల బెడద ఎక్కువగా ఉండటం ధరలపై ప్రభావం చూపిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు భయపడి అధిక శాతం మంది మాంసాహారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో చికెన్‌కు డిమాండ్ లేక రోజురోజుకూ ధరలు పతనమవుతూ వస్తున్నాయి. శ్రావణ శుక్రవారం రోజుల్లో చికెన్ ధర లైవ్ రూ.64, స్కిన్‌లెస్ ధర రూ.150 పడిపోవడం గమనార్హం. ధరలు ఆశాజనకంగా ఉంటే కోడి బరువు రెండు కిలోల నుంచి 2.2 కిలోల బరువు వచ్చేసరికి ఫౌల్ట్రీల నుంచి కోళ్లను మార్కెట్‌లోకి తెస్తుంటారు. ప్రస్తుతం పరిస్థితుల్లో అమ్మకాలు లేక మార్కెట్‌లోకి వస్తున్న కోళ్లు రెండున్నర కిలోలకు పైగా బరువుంటున్నాయి. దీంతో బరువు పెరిగిన కోళ్లకు దాణా అధికంగా వినియోగించాల్సి రావడంతో పాటు గతంలో పోలిస్తే అమ్మకాలు సగానికి తగ్గిపోవడంతో నష్టాలు ఎదుర్కొంటున్నామని పౌల్ట్రీ యజమానులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే చికెన్ ధరలు తగ్గినా కొన్ని గ్రామాల్లో పెంచే విక్రయాలు సాగిస్తున్నారు.

గుడ్డు అదే బాటలో..

బహిరంగ మార్కెట్‌లో లేయర్ కోడిగుడ్డు రైతు ధర ఒడిదొడుకులను ఎదుర్కొంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు మండలాల్లో సుమారు 320 పౌల్ట్రీలు ఉన్నాయి. 1.5 కోట్ల వరకూ గుడ్లు పెట్టే కోళ్లు ఉండగా, రోజుకు 1.20 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 70 శాతం మేర గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా మిగిలినవి స్థానికంగా వినియోగమవుతున్నాయి. జిల్లా నుంచి ఎగుమతులు జరిగే ఉత్తరాది రాష్ట్రాల్లో మనకంటే రెండు వారాల ముందుగానే శ్రావణ మాసం మొదలవుతుందని పౌల్ట్రీ వర్గాలంటున్నాయి. శ్రావణంలో జిల్లా నుంచి ఎగుమతులకు డిమాండ్ తగ్గి రైతు ధర పతనమవుతుంది. ఈ క్రమంలో జూలై 18వ తేదీకి రూ.5.55గా ఉన్న రైతు ధర క్రమంగా తగ్గుతూ ఆగస్టు రెండో వారం నాటికి రూ.4.26కు చేరింది. కొద్ది రోజులుగా పుంజుకోవడం ప్రారంభమైన గుడ్డు ధర గత సోమవారానికి రూ.5.01కు చేరింది. ఈ ధర మరింత పెరుగుతుందనుకున్న తరుణంలో రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ బుధవారం నాటి నెక్ ప్రకటిత రైతు ధర రూ.4.75కు తగ్గిపోయింది.

మునుపెన్నడూ లేని విధంగా..



బహిరంగ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా చికెన్ ధరలు పతనమవుతుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికే పెరిగిన దాణా ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పౌల్ట్రీ రంగానికి ధరల దోబూచులాట మనోవేదనకు గురిచేస్తుంది. రాబోయే నెలల్లో వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉన్నందున చికెన్ ధరలు పెరుగుతాయని భావిస్తున్నాం.

– బొబ్బా వెంకన్న, పౌల్ట్రీ యజమాని, పెదపళ్ల

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అతిథులు

మండపేట: మండపేట మండలం మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. స్మార్ట్ మెటీరియల్స్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్ అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు విచ్చేసి కళాశాలలో కొత్త పరిశోధనలు, అనేక అంశాలపై విద్యార్థులకు విశదీకరించారు. విద్యార్థులు నైపుణ్యం పెంచుకుని కొత్త పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని దక్షిణ కొరియా ప్రొఫెసర్ కె.నవీన్‌కుమార్ సూచించారు. లిథియం బ్యాటరీ మీద తాను చేసిన పరిశోధనలను వివరించారు. డాక్టర్ ఎ.భార్గవ్ మాట్లాడుతూ ఎల్‌ఈడీలపై చేసిన పరిశోధనలను కళ్లకు కట్టినట్టు వివరించారు. నాగ్‌పూర్ ఆర్‌ఎంటీ ప్రొఫెసర్ సంజీవ్ డోగేల్ మాట్లాడుతూ నానో మెటీరియల్స్, నానో ఇంజిన్లు అనే అంశంపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే రామచంద్ర, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి విచ్చేశారు. ప్రోగ్రామ్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సెమినార్‌ను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సెమినార్‌లో చర్చించిన అనేక పరిశోధనలు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను అతిథులు సత్కరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో
సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

అలమూరు: ఆలమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 22న 'వైద్యులపై దౌర్జన్యకాండ' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం వచ్చింది. దీనికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీలకతీతంగా రాజకీయ నేతలు స్పందించారు. సీహెచ్‌సీ ఆవరణలో ఆడియోతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటును శుక్రవారం ప్రారంభించారు. ప్రహరీకి ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి వైద్య ఆరోగ్య సిబ్బంది భద్రతకు తగిన ప్రాధాన్యం ఇస్తామని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ అన్నారు. సీహెచ్‌సీలో ఏవిధమైన సమస్య ఉత్పన్నమైనా సత్వరమే పోలీసు శాఖను సంప్రదిస్తే క్షణాల్లో తమ సిబ్బంది వస్తారని భరోసా కల్పించారు. సీహెచ్‌సీలో భవిష్యత్‌లో దాడులు, వేధింపులు సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పోలీసు శాఖ హామీ ఇచ్చింది. సీహెచ్‌సీలో ఎదుర్కొన్న సమస్యలపై ప్రజలకు తెలియజేసిన 'సాక్షి'కి సూపరింటెండెంట్ పి.అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.



ఆలమూరు సామాజిక ఆసుపత్రిలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సాంకేతిక నిపుణులు

గంజాయి స్వాధీనం

గోకవరం: గంజాయి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గోకవరం పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాల ప్రకారం.. కృష్ణునిపాలెం పంచాయతీ పరిధి రామన్నపాలెం శివారున ఆగి ఉన్న వ్యాన్‌ను శుక్రవారం పోలీసులు గుర్తించి తనిఖీలు చేశారు. అందులో సుమారు 22 బస్తాల్లో 8 వందల కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ నిర్వహిస్తున్నారు. దీనిపై పోలీసులు ఎటువంటి సమాచారం వెల్లడించలేదు.



గంజాయితో పట్టుబడిన వ్యాన్

వ్యక్తి అరెస్ట్

తుని: స్థానిక రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం డీఎస్పీ ఎల్.మోహనరావు, సీఐ గౌస్‌బేగ్ ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై నార్త్ ఈస్ట్ ఢిల్లీ అలీగర్‌కు చెందిన బ్రాజేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని బ్యాగు తనిఖీ చేశామని అన్నారు. అందులో 6.40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్ట్ చేశామని చెప్పారు. గంజాయి విలువ రూ.31,500 విలువ ఉంటుందన్నారు. నిందుడిని అరెస్ట్ చేసి రైల్వే కోర్టులో హాజరు పరిచామన్నారు. మాదక ద్రవ్యాల తరలింపు ముఠాలను పట్టుకోవడానికి జీఆర్పీ, ఆర్‌పీఎఫ్‌తో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి, అన్నవరం, తుని, నర్సీపట్నం రోడ్డు, ఎలమంచిలి రైల్వే స్టేషన్లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్సై అనిల్‌కుమార్, జీఆర్పీ సిబ్బంది సూర్యప్రకాష్, శివసురేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని 14 మేకల మృతి

నల్లజర్ల: మండలంలోని దుప్పిగుంట (పార్వతిపురం) వద్ద శుక్రవారం ఉదయం మేకలు మేత కోసం వెళ్లి తిరిగి చీకటిపడే వేళ ఇంటికి వెళుతున్న క్రమంలో ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో 14 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. అదే ప్రాంతానికి చెందిన యంత్రపాటి చంద్రయ్యకు 24 మేకలు ఉన్నాయి. వాటిని సమీప పొలాల్లో మేపడానికి తీసుకెళ్లి తిరిగి వచ్చే క్రమంలో రోడ్డు దాటితే చంద్రయ్య ఇల్లు వస్తోంది. రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోగా కొయ్యలగూడెం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న వ్యాన్ చీకట్లో ఈ మేకలను ఢీకొంది. చనిపోయిన మేకల విలువ రూ.3 లక్షల వరకూ ఉంటుందని అంచనా.



మృతి చెందిన మేకలు

ఉరి వేసుకుని కార్మికుడి ఆత్మహత్య

ప్రత్తిపాడు: లంపకలోవలోని వీరభద్రా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కంపెనీ సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం కలహంది జిల్లా నర్లా గ్రామానికి చెందిన పపు మంగరాజ్ (26) లంపకలోవ గ్రామ సమీపంలోని వీరభద్రా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. అనారోగ్యానికి గురైన కుమారుడిని చూసేందుకు గురువారం బయలుదేరిన అతను తిరిగి వచ్చేసి, కంపెనీ ఇచ్చిన నివాసానికి వెళ్లాడు. ఉదయం కంపెనీ సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకున్నాడు.

పంట బోదెలో పడి దివ్యాంగుడి మృతి

అల్లవరం: గోడిలంక రైస్‌మిల్లు వద్ద పంట బోదెలో పడి ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన చెక్కా వెర్రియ్య (29) బెండమూర్లంక పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 21న వెర్రియ్య తన భార్య, పిల్లలను ఓడలరేవులోని పుట్టింటికి తీసుకెళ్లాడు. అక్కడ తన బావమరిది భార్య సీమంతం వేడుక చూసుకుని అమలాపురం వెళ్లి వస్తానని భార్యకు చెప్పి తన స్కూటీపై బయలు దేరాడు. గోడిలంక మలుపు వద్ద శివాలయం ఎదురుగా ఉన్న పంట బోదెలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. రాత్రి సమయం కావడంతో ఎవరూ చూడకపోవడంతో వెర్రియ్య చనిపోయాడు. రెండు రోజులుగా అతని ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలో గోడిలంక రైస్‌మిల్లు మలుపు వద్ద పంట కాలువలో శుక్రవారం సాయంత్రం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అతడిని వెర్రియ్యగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడు గతంలో బెండమూర్లంక సెంటర్లో జరిగిన ఓ క్రేన్ ప్రమాదంలో ఎడమ కాలిని కోల్పోయాడు. కృత్రిమ కాలిని అమర్చుకుని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.